

హత్యకు గురైన బాలిక



సిర్రా రంజిత(ఫైల్‌ఫొటో)

పాపం.. ఏం చేసిందని!

- తెలిసినవాడిగా ఇంట్లో చేరిన నిందితుడు
- కొన్నాళ్లుగా నగదు, బంగారంపై కన్ను
- చోరీని బాలిక గమనించడంతో హత్య
- పోలీసులకు పట్టించిన అతి ప్రవర్తన

ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో కూడా తెలియడం లేదు. నమ్మితే నట్టేట ముంచేసే వాళ్లు.. మన చుట్టూనే తిరుగుతున్నారు.. రామచంద్రపురంలో ఇదే జరిగింది.. ఇంట్లో నమ్మకంగాఉన్న వ్యక్తి పాపం.. ఏంచేసిందని.. ఏం చూసిందనేది ఆలోచించకుండా పదేళ్ల చిన్నారిని పొట్టన పెట్టుకున్నాడో క్రూరుడు.. చున్నీని బాలిక మెడకు చుట్టి.. ఆమెను మంచంపైకి తోసి ముఖాన్ని నొక్కి అదిమిపట్టి హత్యచేశాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా బాలిక మృతదేహాన్ని ఫ్యాన్‌కు ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఇదంతా చేసిందెవరో తెలిసి పోలీసులే అవాక్కయ్యారు. ఆ కుటుంబానికి పరిచయమున్న వ్యక్తి.. బాలిక తల్లిని అక్కా అని పిలిచేవాడే ఈ పాపానికి ఒడిగట్టాడు.. రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన పెయ్యల శ్రీనివాస్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. బాలిక తల్లిదండ్రులకు తొలుత అలాగే పరిచమయ్యాడు. ఇంట్లో ఎలక్ట్రికల్ సమస్య ఏదున్నా అతనికే చెప్పేవారు. వచ్చి చేసి వెళ్లిపోయేవాడు. ఆ ఇంట్లో సొంతవాడిలా మెలుగుతున్నాడు.. ఏ పని ఉన్నా వాడికే ఫోన్ చేసేలా మారిపోయాడు. అలా ఆనుపానులు చూసుకున్నాడు. బంగారం, డబ్బు దొంగిలించాలన్న దుర్బుద్ధితో ఈనెల 4న ఆ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో ఉన్న చిన్నారి తన చోరీ యత్నాన్ని పసిగట్టిందన్న భయంతో కర్కశంగా చంపేశాడు. బాలిక మృతదేహం పక్కనే నిలబడి కన్నీటి పర్యంతమయ్యాడు. తన నట విశ్వరూపం చూపాడు. బాలిక మృతికి తాను బాధపడుతున్నట్టుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. బాలిక మరణించిన తర్వాత రోజు తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతుంటే వారి పక్కనే ఉన్నాడు. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా తప్పించుకున్న నిందితుడు అతి ప్రవర్తనతో పోలీసులకు దొరికిపోయాడు. అంతే అతడి పాపం పండిపోయింది.. పెయ్యల శ్రీనివాస్‌ను తొలుత పోలీసులు నిందితుడిగా అనుమానించలేదు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరిస్తుండగా వారితో అతిగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్‌కు అనుమానం వచ్చి అతడి వేలిముద్రలు తీసుకున్నారు. అదే దర్యాప్తులో కీలకంగా మారింది. శ్రీనివాస్ వేలిముద్రలు సరిపోవడంతో ఆదివారం పోలీసులు దీన్ని హత్యగా తేల్చారు. తల్లి లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించి.. బాలికను హత్య చేసి ఏమీ తెలియనట్టుగా ఉరివేసి వెళ్లిపోయాడని తేల్చారు. ఇది తెలియడంతో బాలిక తల్లిదండ్రులు ఘొల్లుమన్నారు. పాపను ఇలా చంపేస్తాడనుకోలేదని కన్నీటి పర్యంతమయ్యారు. వాడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హత్యకేసును నాలుగురోజుల్లో చేధించిన డీఎస్పీ రఘువీర్, సీఐలు నారాయణ, దొరరాజు, ఎస్‌ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, జానీభాషా, సురేష్‌బాబు, అంగర హరీష్‌లతోపాటు ఫింగర్ ప్రింట్ బ్యూరో అమలాపురం ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, వారి బృందం సభ్యులను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అభినందించారు.

- ద్రాక్షారామ(రామచంద్రపురం)-ఆంధ్రజ్యోతి

పూర్తి వివరాలు మెయిన్‌లో..

ఆపేదెవరు.. భైరవా..

భౌబోయ్.. బతకనివ్వడంలేదు!



సుప్రీం ఆదేశాలు అమలయ్యేనా?

వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఏబీసీ తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో వదలొద్దని ఆదేశించింది. కానీ ఈ రెండిటిపై కార్యాచరణ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకూ జిల్లాలో కుక్కల షెల్టర్లు లేవు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏబీసీ తర్వాత ఎక్కడ వదిలి పెట్టాలనే అంశం కూడా కీలకం కానుంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా ప్రాంగణాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, జన సమ్మర్ద ప్రాంతాల్లో వీధి కుక్కల జాడ ఉండడానికి వీల్లేదని సుప్రీం చెప్పింది. విద్యా సంస్థల వద్ద కుక్కలు రాకుండా ఏర్పాట్లు ఉన్నా.. మిగతా చోట్ల నియంత్రించడంపై చిత్తశుద్ధి అవసరంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడం చాలా కష్టమనే ప్రచారం సాగుతోంది. వీధికుక్కలను పట్టుకుని ఒక చోట చేర్చడం ఓ పెద్ద ప్రహసనమే అంటున్నారు. అన్ని కుక్కల ఆలనాపాలనా చూడాలంటే తలకుమించిన భారమవుతోందని చెబుతున్నారు.ఈ క్రమంలో సుప్రీం ఆదేశాలపై అధికారులు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది.



ఎక్కడపడితే అక్కడ కుక్కలు.. అందుగలవు.. ఇందులేవని సందేహం వలదు.. ఎటు చూసినా కుక్కలే.. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే.. ఎంతలా అంటే ఏ వీధిలో అడుగుపెట్టాలన్నా భయపడేంతగా కుక్కలు పెరిగిపోయాయి.. బడి..గుడి.. ఆసుపత్రి.. బస్టాండ్.. రైల్వే స్టేషన్..క్రీడాప్రాంగణాలు ఎక్కడ చూసినా అవే.. జనసమ్మర్ద ప్రాంతాల్లో కుక్కలు కనబడకూడదని సాక్షాత్తూ సుప్రీం కోర్టు ఆదేశించినా తీరులో మార్పేమి లేదు.. అవి యథేచ్ఛగా తిరుగుతూనే ఉన్నాయి.. అధికారులు చూస్తూనే ఉన్నారు.. కుక్కలు తరుముతుంటే జనం బౌబోయ్ అంటూ పరుగులు పెడుతున్నారు.. ఇకనైనా అధికా రులు దృష్టి పెట్టి కుక్కల నివారణ చర్యలు చేపట్టాల్సిందే మరి..

- (రాజమహేంద్రవరం/ కాకినాడ/ అమలాపురం రూరల్- ఆంధ్రజ్యోతి)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పట్టణం,గ్రామం అనే తేడా లేకుండా రాత్రి వేళ అధికారులను ఏ వీధిలోకి పంపించినా కుక్కలకు బందీ లవు తారు. వీధుల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు జనం పిక్కలు లాగేయడానికి సిద్ధంగా ఉంటున్నాయి. అవి దయతలిస్తేనే రోడ్డుపై జనం సంచరించే పరిస్థితు లు ఉన్నాయంటే అబద్ధం కాదు. కుక్క కరవకుండా ఇంటికి చేరుకున్నామంటే అదృష్టంగానే భావించాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.రాజమండ్రి రైల్వేస్టేషన్లో కుక్కలను తప్పించుకొని వెళ్లే కంగారులో ప్రమాదాలు జరుగు తున్నాయి.పిల్లల చేతిలో ఏమైనా తిను బండారాలు ఉంటే వాటిపైకి ఇసురుగా వచ్చి లాక్కోవడంతో పాటు పిల్లలపై దాడి చేయడానికి యత్నిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం కన్నెర్ర చేసే వరకూ పరిస్థితి వెళ్లింది.ఇప్పటికైనా భౌబోయ్ భయం తగ్గుతుందేమో అని జనం చర్చించుకుంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో లక్షకుపైనే గ్రామ సింహాలు
- పెరిగిపోతున్న కుక్కల సంతతి
- ఆసుపత్రులకు కుక్కకాటు బాధితుల క్యూ
- తూతూ మంత్రంగా ఏబీసీ ఆపరేషన్లు
- సుప్రీం కోర్టు ఆదేశించినా కానరాని కదలిక

పెంచేసిన..కరోనా

కరోనా విపత్తు 2019, 2020,2021, 2022లో ఏబీసీ ఆపేయడంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు.2023, 2024లో ఆ సంఖ్యను అదుపులోకి తీసుకురావడానికి సీరియస్‌గా యాక్షన్‌లోకి దిగలేదు. పంచాయతీల్లో ఏబీసీలు లేకపో వడంతో ఆయా ప్రాంతాల్లోని కుక్కలను తీసుకొచ్చి నగర శివార్లలో వదిలేస్తున్నారు. కుక్కలకు డిసెంబరు, జనవరి నెలల్లో బ్రీడింగ్ సమయం. ఒక్కో కుక్కకు ఒక ఈతలో 4 నుంచి 8 పిల్లలు పుడుతుంటాయి.

ఏబీసీ పని చేస్తోందా!

కుక్కల సంఖ్య నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్రచికిత్సలు చేస్తుంటారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో రోజుకు ప్రస్తుతం 25 వరకూ ఏబీసీ చేస్తున్నామని చెబుతున్నారు.ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున కార్పొరేషన్ ఖర్చుచేస్తోంది. కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు రాజమహేంద్రవరం కార్పొ రేషన్‌కే పరిమితమైంది. దీని పైనా పర్యవేక్షణ లేదు..ఏ రోజు ఏం చేశారనే నిఘా లేదు. కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో పట్టించుకోవడం లేదు. పంచాయతీల్లో ఏబీసీ చేయ డానికి నిధుల కేటాయింపు లేదు.ఏబీసీ ఆప రేషన్ చేసినా కొన్నింటికి ఫెయిలవుతున్నాయనే వాదన ఉంది. కాకి నాడ,కోనసీమలో ప్రైవేటుగా చేయిస్తున్నట్టు సమాచారం.

వెటర్నరీ చతికిల

జిల్లా వ్యాప్తంగా వెటర్నరీ ఉన్న ఆస్పత్రుల్లో సర్జరీలకు పరికరాలు అందుబాటులో ఉంటాయి. వెటర్నరీ డిస్పెన్సరీలు ఉంటాయి. ఎక్కడా వెటర్నరీ శాఖ ఏబీసీపై దృష్టి సారించడం లేదు.దీంతో పంచాయతీల్లో కుక్కల సంతతి విపరీతంగా వృద్ధి చెందుతోంది. గతంలో కలెక్టర్ ఆదేశాలతో రాజమహేంద్రవరం వెటర్నరీ ఆస్పత్రిలో ప్రతి ఆదివారం వీధి కుక్కలకు ఏబీసీ చేసేవారు. నిలిపివేశారు ఎందుకో మరి..

'తూర్పు'న 50 వేలు..

తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 50 వేల గ్రామ సింహాలు ఉన్నట్టు అంచనా.రాజమహేంద్రవరం సిటీ పరిధిలోనే తక్కువలో తక్కువంటే 15 వేలు ఉంటాయి. శంభూనగర్‌లోనే కుక్కల సంఖ్య అధికం. అధికారులు మాత్రం బాగా తక్కువ చేసి చూపే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రోజుకు కుక్కల నోటికి 100 మంది వరకూ చిక్కుతున్నారు. రాజమహేంద్రవరం సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ సుమారు 50 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారు.చికిత్స పొందుతున్న వాళ్లు మరో 50 మంది ఉంటున్నారు. ఈ లెక్కన రోజుకు 100కి పైగానే జనం కుక్కల బారిన పడుతున్నారు.

కాకినాడలో 37 వేలు

కాకినాడ జిల్లాలో 37 వేలు శునకాలు ఉన్నట్టు అంచనా. వాటిలో 15 వేలు కాకినాడ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి.జిల్లాలో 2021లో కుక్క కాటు కేసులు 6031 నమోదు కాగా రేబిస్‌తో ఏడుగురు మృతిచెందారు. 2022లో 6364 కేసులు నమోదైతే ఆరుగురు మృతిచెందారు. 2023లో 4293 కేసులు నమోదైతే ఇద్దరు రేబిస్‌తో మృతి చెందారు.2024లో 5 వేల మంది, 2025లో 4 వేల మంది కుక్కకాటు బారిన పడ్డారు.కాకినాడ అధికారులు ఏబీసీ ఆపరేషన్లు ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా చేయిస్తున్నా సత్ఫలితాలనివ్వడంలేదనే ఆరోపణలున్నాయి.

'కోనసీమ'లో 30 వేలు

కోనసీమ జిల్లాలో పెంపుడు,వీధికుక్కలు 30 వేలు ఉంటాయని చెబుతున్నారు. ఒక్క అమలాపురంలోనే 5 వేలుపైనే వీధి కుక్కలు ఉంటాయని సమాచారం..జిల్లాలోని పీహెచ్‌సీల్లో రోజుకు 40 మంది వరకు కుక్క కాటు బాధితులు వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లాలో 4 వేల కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. అమలాపురంలో కుక్కలను పట్టుకునేందుకు కాంట్రాక్టర్‌ను నియమించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారం వేదిక సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని వారు తమ అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వరి కోత పనులకు వచ్చి.. విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి 7

- వరి కోత మిషన్ తరలిస్తుండగా గండేపల్లి మండలంలో ఘటన

మనస్తాపంతో ఉరి వేసుకున్న బాలింత

- మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో ఘటన

7

గోదావరిలో స్నానానికి దిగి విద్యార్థి మృతి 7

కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి 7

- భారీగా తరలివచ్చిన భక్తులు
- 9వేల వ్రతాలు
- రూ.85 లక్షల ఆదాయం

రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల్లో 'కాకినాడ'కు మూడోస్థానం



రెవెన్యూ సర్వీసెస్ క్రీడల్లో మూడోస్థానంలో నిలిచిన కాకినాడ జట్టు

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 7, 8, 9తేదీల్లో అనంతపురంలో నిర్వహించిన ఏపీ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్రస్థాయిక్రీడా పోటీల్లో కాకినాడ జిల్లాకు మూడో స్థానం లభించినట్లు వీఆర్‌ఓల సంఘంజిల్లా అధ్యక్షుడు సీహెచ్ చిన్న, జిల్లా కార్యదర్శి జీవీ సూరిబాబు తెలిపారు. కాకినాడ రెవెన్యూ ఉద్యోగులు అద్భుత ప్రతిభ కనబర్చి 30పాయింట్లతో మూడోస్థానంలో నిలిచారన్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.క్రీడలకు సహకరించిన కలెక్టర్ షాన్ మోహన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు త్రినాథ్‌రావు, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు,నాయకులు చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

అవయవదానమే జీవనదానం

- రాష్ట్ర వీఐఎంఎస్, సీటీసీ జీవనదాన్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు
- కాకినాడలో వాకథాన్ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీవీఐఎంఎస్, సీటీసీ జీవనదాన్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జీవనదాన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించారు. ఆదివారంఉదయం 7గంటలకు నగరంలోని అపోలో హాస్పిటల్‌వద్ద వైద్యులు, నర్సులు, విద్యార్థులు, సమాజ సేవకులు, ప్రజలు వందలాదిగా పాల్గొని వాకథాన్ నిర్వహించారు. ఫాబిస్ కన్వెన్షన్ హాలు సాగినర్యాలీలో ప్రజలకు అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అవయవదానంతో మరొకరి జీవితాన్ని కాపాడడం అత్యున్నతమైన సేవ అన్నారు. గౌరవ అతిథి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అవయవదానం సామాజిక ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, ఆర్ఎంసీ మాజీ సంచాలకుడు డాక్టర్ బాబ్జీ హాజరయ్యారు. వాకథాన్ విజయవంతంపై ఏపీవీఐఎంఎస్, సీటీసీ జీవనదాన్ డైరెక్టర్‌డాక్టర్ రాంబాబు సంతోషం వ్యక్తంచేశారు. వైద్యులు రామకృష్ణజీవీరావు పాల్గొన్నారు.



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పిడింగొడ్డి రెగ్యులేటర్ వద్ద కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న గట్టు

కడగండ్లు!

తుఫాన్ వర్షాలకు 44 చోట్ల గండ్లు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్... ఆ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు.... ఆపై ఏలేరుకు వరద ఫలితంగా పంట కాలువలు చిన్నాభిన్నమయ్యాయి. ఎక్కడికక్కడ కాలువలకు గండ్లు పడ్డాయి. ఏలేరు, పీబీసీ పరిధిలో 44 చోట్ల గండ్లు పడగా వాటిని అత్యవసరంగా పూడ్చాల్సిన అవసరం ఉందని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గండ్లు పూడ్చి, కోతకు గురైన గట్లకు మరమ్మతులు నిర్వహించకుంటే రబీలో పంట పొలాలకు సాగునీరందడం కష్టసాధ్యమని రైతులు చెబుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో ఏలేరుకు వరదలొచ్చాయి. అధిక వర్షాలు, వరదల కారణంగా ఏలేరు, పీబీసీ కాలువలు ఉన్న ప్రాంతాల్లో పలుచోట్ల గండ్లు పడగా, గట్లు కోతకు గురయ్యాయి. ఫలితంగా పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గతేడాది ఏలేరుకు వచ్చిన అతి భారీ వరదల కారణంగా పడిన గండ్లు, కోతకు గురైన ప్రాంతాల్లో ఇవి అధికంగా పడ్డాయి. దీంతో ఏలేరు నీటి ప్రవాహం తగ్గినా గండ్ల నుంచి నీరు మాత్రం ప్రవహిస్తూనే ఉంది. ఈ కారణంగా వరి, ఇతర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పుడు ఈ గండ్లను అత్యవసరంగా పూడ్చాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసినా అవి కాలువల్లో నీటి ప్రవాహం పెరిగితే కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది.

పనులు చేపట్టకపోతే కష్టమే!

గండ్లు పూడ్చడంతో పాటు గట్లను పటిష్టపరచకపోతే ఏలేరు, పీబీసీ, పంపా ఆయకట్టులో రైతులకు రెండో పంటకు సాగునీరు అందడం కష్టమే. ఇప్పటికే ఏలేరులో నీరు తగ్గినా ఇంకా పలుచోట్ల గండ్ల నుంచి నీరు ప్రవహిస్తోంది. నీరు ఏమాత్రం అధికమైనా పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదముంది. ఏలేరు, పీబీసీ పరిధిలో వరి కోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో రెండు, మూడు వారాల్లో రైతులు రబీసాగుకు వరి నారుమడులు వేస్తారు. ఈలోగా ఈ పనులను చేపట్టి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే తమ పరిస్థితి దినదినగండంగా ఉంటుందని రైతులు తెలిపారు. తక్షణం తాత్కాలిక పనులు చేపట్టి గండ్లను పూడ్చడంతో పాటు గట్ల పటిష్టానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నష్టం ఇలా

ఏలేరు వరదల కారణంగా కిర్లంపూడి, గొల్లప్రోలు,పిఠాపురం, కొత్తపల్లి, సామర్లకోట, తొండంగి మండలాల్లోని ఏలేరు, పీబీసీ, పంపా పరిధిలోని కాలువలకు భారీ నష్టం జరిగింది. గండ్లు పడడంతో పాటు గట్లు జారిపోయి కోతకు గురయ్యాయి.గతేడాది ఏలేరుకు వచ్చిన భారీ వరదల కారణంగా 280కిపైగా ప్రాంతాల్లో గండ్లుపడగా ఇందులో సుమారు 100 మాత్రమే పూడ్చారు. మిగిలిన వాటిని పూడ్చేందుకు, గట్ల పటిష్ఠతకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అప్పటికే ఏలేరు, పీబీసీ, పంపా కాలువలకు నీరు విడుదల చేయడంతో పనులు సాధ్యం కాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో కాలువ గట్లు బలహీనంగానే ఉన్నాయి.



గొల్లప్రోలు కాలువ, నడిమేరుకు పడిన గండి

- ఏలేరు, పీబీసీ, పంపాలో కష్టం
- తాత్కాలిక పనులకు రూ.2.49 కోట్లు
- శాశ్వత పనులకు రూ.21.38 కోట్లు
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు
- పూడ్చకుంటే రబీకి సాగు నీరు కష్టమే

నిధులిస్తే..

ఏలేరు వరదల కారణంగా పడిన గండ్లను అత్యవసరంగా పూడ్చాల్సిన అవసరంపై ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపా రు. జరిగిన నష్టాన్ని తక్షణం తమకు తెలియజేయాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో తాత్కాలికంగా పనులు చేపట్టేందుకు ఎంత వ్యయం అవుతుంది, శాశ్వత ప్రాతిపదికన పనులకు అయ్యే వ్యయాన్ని వివరిస్తూ నివేదికలు తయారు చేశారు. కిర్లంపూడి మండలంలోని ముక్కొల్లు, రాజుపాలెం, సోమరాయణంపేట, చిల్లంగి తదితర ప్రాంతాల్లో 27చోట్ల గండ్లు పడడం, గట్లు కోతకు గురైనట్టు గుర్తించారు. గొల్లప్రోలు, పిఠాపురం పరిధిలో గొల్లప్రోలు కాలువ, పిడింగొడ్డి, బల్లకట్టు, నక్కలఖండి, నడిమేరు తదితర ప్రాంతాల్లో పదిచోట్ల గండ్లు పడడం, గట్లు జారిపోవడం జరగ్గా... కొత్తపల్లి మండలం రమణక్కపేట వద్ద ఒకచోట, సామర్లకోట మండలంలో రెండుచోట్ల, తొండంగి మండలంలో వజ్రకూటం,తొండంగి గ్రామాల్లో ఎండీ3, పంపా కాలువలకు మూడుచోట్ల, పెదపూడి మండలం చింతపల్లి వద్ద ఒకచోట గండి పడినట్టు గుర్తించారు. మొత్తం 44చోట్ల గండ్లు పూడ్చడం, కోతకు గురైన, జారిపోయిన గట్లకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టేందుకు రూ.248.95 లక్షలు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇవే పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టేందుకు రూ.2138.60 లక్షలు అవసరమవుతుందని ప్రభుత్వానికి నివేదించారు. నిధులిస్తే తక్షణం పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

'లోవ'లో భక్తుల రద్దీ

రూ.2.43 లక్షల ఆదాయం

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదుల్లో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తిభోజనాలు చేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.2.43 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తలుపులమ్మ


క్యూలో బారులుతీరిన భక్తులు

కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి

భారీగా తరలివచ్చిన భక్తులు

9వేల వ్రతాలు

రూ.85 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తజనసందోహంగా మారింది. వేకువజామున 2గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు ప్రారంభించగా సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయంగా రద్దీ కొనసాగింది. ఒక దశలో క్యూలైన్లు, వ్రత మండపాలు కిక్కిరిసి నిండిపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వాహనాల పార్కింగ్‌తో గందరగోళ పరిస్థితులు రావడంతో ఎస్‌ఐ హరిబాబు కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలను కొండదిగువ కళాశాల మైదానంలో పార్కింగ్ చేయించి కొండ దిగువ నుంచి ఉచిత బస్సుసౌకర్యం కల్పించారు. సుమారు 90వేలమందిని స్వామిని దర్శించుకోగా సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా 25వేలమందికి ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామి వారి ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉండాల్సి వచ్చింది. చైర్మన్ రోహిత్ దగ్గరుండి ఎటువంటి తోపులాటలు జరగకుండా పర్యవేక్షించారు. ఆదివారం ఒక్కరోజు 9వేల జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షలు ఆదాయం లభించింది. భక్తుల రద్దీతో అంత్రాలయం దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. దిగువభాగంలో ఉన్న యంత్రాలయం సాయంత్రం వరకు పూర్తిగా నిలిపివేశారు. ఈవో సుబ్బారావు సత్యగిరికొండ, వ్రత మండపాలలో తిరుగుతూ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. కాగా రత్నగిరిపై కార్తీక సోమవారం జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆదివారం రాత్రే భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. వసతి గదులు సరిపడక ఆరుబయట విశ్రమించారు.




క్యూలో బారులు తీరి సత్యదేవుడి దర్శనానంతరం వస్తున్న భక్తులు

కన్నీటితో.. కన్నరుణం..

తీర్చుకున్న కూతురు


-కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి)

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లి పంచాయతీ లచ్చిరాజుచెరువులో బడుగు వెంకటరమణ (48) అనారోగ్యంతో మృతిచెందాడు. అతడికి కొడుకులు లేరు. ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. భార్య అనారోగ్యంతో ఉంది. పెద్ద కూతురుకు పెళ్లయ్యింది. రెండో కుమార్తె శ్రావణి ఆదివారం తన తండ్రికి కన్నీటితో తలకొరివి పెట్టింది.

సింగపూర్‌లో విద్యావ్యవస్థ పరిశీలనకు తెలుగు టీచర్ ప్రభావతి

అంతర్వేది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలంక జీఎంసీ బాలయోగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్, తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇటీవల లభించింది. ఏపీ ఎన్జీసీ స్టేట్ మోనిటరింగ్ అధికారిగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 2012నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సీఈఆర్టీలో స్టేట్ రిసోర్సుపర్సన్‌గా అనేక కరదీపకలను రూపొందించడంలో పాల్గొన్నారు. ఎన్నో ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వరకు సింగపూర్‌లోని విద్యావ్యవస్థను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తుదని ఆమె తెలిపారు. ఆమెను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, జిల్లా యంత్రాంగం అభినందించారు.


గుండేపల్లి ప్రభావతి

వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

వాడపల్లిలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పూజలు


వాడపల్లి వెంకన్న ఆలయంలో అయ్యన్నపాత్రుడికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచి కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీదేవి భూదేవి సమేత వాడపలి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం పూర్ణకుంభంతో మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో వేద పండితుల ఆశీర్వచనం స్పీకర్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచంద్రరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో స్పీకర్ మాట్లాడుతూ స్వామివారు ఎంతో ప్రాచుర్యం పొందారని, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఖ్యాతిని అర్జించనడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారన్నారు. తాను సామాన్య భక్తుడిలానే కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకున్నానన్నారు. క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, మరింత అభివృద్ధికి సహకారం అందిస్తానని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని, దీనికి అనుగుణంగా మహిళలతో ఆలయాల్లో రద్దీ పెరిగిందని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే బండారు తనయుడు బండారు సంజీవ్, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ కాయల జగన్నాథం, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్‌ఐ రాము, నాయకులు ఉన్నారు.

వరి కోత పనులకు వచ్చి...

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి... మృతులు పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం వాసులు

గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యమ్మపాలెం నుంచి సింగరంపాలెనికి ఆదివారం ఉదయం వరి కోత మిషన్‌ను ఐషర్ వ్యాన్ మీద తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్‌ఐ యువి శివ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఐషర్ వ్యాన్ పై వరి కోత మిషన్‌ను తరలిస్తుండగా దారి మధ్యలో 11కెవి విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ గెడ్డం సందీప్ (20) షాక్‌తో మృతిచెందాడు. ముందు బండి మీద వెళుతున్న మిషన్ యజమాని కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వెనక్కి వచ్చి ఏమయిందోనని ఆందోళనతో వ్యాన్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతిచెందిన ఇద్దరు పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు, రాపాక గ్రామాలకు చెందినవారు. వరి కోత పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ ఎడమ వైపునకు రావడంతో మిషన్ పైన గొట్టం విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ సరఫరా అయినట్టు తెలిపారు. మృతదేహాలను అంబులెన్స్‌లో మార్చురీకి తరలించామన్నారు. రైతుల మోటార్లకు త్రి ఫేస్ విద్యుత్తు సరఫరా ఉండడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివ నాగబాబు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ




సందీప్, సింహాద్రి (ఫైల్)



మనస్తాపంతో ఉరేసుకున్న బాలింత

మండపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో భర్త మాటలకు మనస్తాపానికి గురైన 4 నెలల బాలింత ఉరివేసుకుంది. మండపేట రూరల్ సీఐ పీతల దొర్రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బోడసకుర్రుకు చెందిన మట్టా వేణు(28)కు ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెనికి చెందిన రేఖ(24)తో మూడేళ్లక్రితం వివాహం జరిగింది. మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో ఉన్న కొబ్బరితోటలో కపాలదారుడిగా ఉంటున్న రేఖ తండ్రి నేదునూరు శ్రీను 4 నెలల క్రితం కూతురిని పురుడు కోసం రేఖ వేములపల్లికి తీసుకొచ్చాడు. రేఖకు మగ బిడ్డ పుట్టాడు. తర్వాత రోజూ తన భర్తతో ఫోన్‌లో మాట్లాడేది. శనివారం రాత్రి భర్తతో ఫోన్ మాట్లాడుతున్న సమయంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. వేణు బోడసకుర్రులో ఇంటి నిర్మాణానికి భార్యను రూ.లక్ష తీసుకురమ్మని డిమాండ్ చేశాడు. తన తండ్రి వద్ద డబ్బు లేదని, కుటుంబ పరిస్థితి బాగాలేదని చెప్పింది. అయినా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో తన కూమార్తె మనస్తానికి గురై శనివారం తెల్లవారుజామున పొలంలో ఉన్న పాకలో దూలానికి చీర కట్టి ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంఘటనా స్థలాన్ని మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, రూరల్ ఎస్‌ఐ సంఘటనా పరిశీలించారు. కేసు నమోదు చేశామని మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. తల్లిని కోల్పోయిన నాలుగు నెలల బాబు పరిస్థితి దయనీయంగా మారింది.


రేఖ (ఫైల్)

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన బుజ్జి బాబు

వై.రామవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం చవిటిదిబ్బలు శివారులో ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. పి.ఎర్రగొండకు చెందిన జల్లి బుజ్జిబాబు (19) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. బుజ్జిబాబు అడ్డతీగల వైపు నుంచి పి.ఎర్రగొండ వస్తుండగా మరో ద్విచక్ర వాహనంలో గొడుగురాయికి చెందిన వీకా ఈశ్వర దొర, కురసం విశ్వతేజ అనే యువకులు ఎదురుగా వస్తున్నారు. వారిద్దరి కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్సులో వై.రామవరం ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నట్టు వైద్యుడు జీవన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లాల జూడో చాంపియన్ 'అనంతపురం'

బాల, బాలికల విభాగాల్లో సత్తా చాటిన క్రీడాకారులు

సర్పవరం జంక్షన్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): అంతర్ జిల్లాల జూడో చాంపియన్లుగా అనంతపురం జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు నిలిచాయి. రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 పోటీలు రెండు రోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో హోరాహోరీగా సాగాయి. ఫైనల్ పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి హైస్కూలు క్రీడా ప్రాంగణంలో రసవత్తరంగా జరిగాయి. బాల, బాలికల విభాగాల్లో అనంతపురం జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. విజేతలకు కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్, కాకినాడ రూరల్ ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు, ఎంఈవో-2 శ్రీనివాస్‌కుమార్, జూడో సంఘ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. బాలుర విభాగంలో కృష్ణా (ద్వితీయ), కర్నూలు (తృతీయ), బాలికల విభాగంలో చిత్తూరు (ద్వితీయ), గుంటూరు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఆయా జిల్లాల జట్ల క్రీడాకారులకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కె.శ్రీ నివాస్, పీఈటీల సంఘ కార్యదర్శి వి.మాచరిరావు, కోశాధికారి కె.నాగలింగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకు డు ప్రతాపరెడ్డి, రవి రాజు, గిరి, ప్రసాదరెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం బాలికల, బాలుర జట్లకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



గోదావరిలో స్నానానికి దిగి పదోతరగతి విద్యార్థి మృతి

కపిలేశ్వరపురం/ అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక వద్ద ఆదివారం గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతిచెందాడు. అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నామాడి బన్ను (15) కేదార్లంక శివారు వీధివారిలంక ధనమ్మ మర్రి వద్దకు స్నేహితులతో కలిసి వచ్చాడు. అనంతరం గోదావరి నదిలో స్నానానికి ముగ్గురు స్నేహితులతో కలిసి దిగాడు. వారిలో బన్ను గల్లంతయ్యాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విహారయాత్రకు వెళ్లిన బన్ను(15) గోదావరిలో మృతిచెందడంతో పుల్లేటికుర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. బన్ను పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతడి తండ్రి అబ్రహం ఆటో డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బన్ను పెద్ద కుమారుడు కాగా చిన్న కుమారుడు అభిషేక్ ఆరో తరగతి చదువుతున్నాడు.


బన్ను (ఫైల్)

వైఎంసీఏ ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు


విజేతలకు షీల్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. రీజనల్ స్థాయిలో 152 మంది క్రీడాకారులతో 14జట్లు పాల్గొన్నాయి. వైఎంసీఏ సౌత్ ఇండియా రీజియన్ చైర్మన్ డాక్టర్ టి.సుమన్‌త్యాగరాజ్, కార్యదర్శి రెవ ఎస్.ధనరాజ్, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రోలాండ్ విలియమ్స్, అమలాపురం శాఖ అధ్యక్షుడు ఎం.బాలాస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈపోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ప్రారంభించారు. జూనియర్, సీనియర్స్ విభాగంలో లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కోచ్‌లు ఐ.భమేష్, కట్టా పురుషోత్తం పర్యవేక్షించారు.

విజేతగా రాజమహేంద్రవరం జట్టు..

సీనియర్స్ విభాగంలో 4 జట్లు, జూనియర్స్ విభాగంలో 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెన్ విభాగంలో రాజమహేంద్రవరం జట్టు విన్నర్‌గా, యానాం జట్టు రన్నర్‌గా నిలిచింది. వైఎంసీఏ బాలయోగి స్టేడియం జట్టు తృతీయస్థానం సాధించింది. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అంబాజీపేట జట్టు ప్రథమ, అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత జట్టు ద్వితీయ, అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల జట్టు తృతీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో యానాం జట్టు ప్రథమ, అమలాపురం జట్టు ద్వితీయ, అంబాజీపేట జట్టు తృతీయ స్థానాలు సాధించగా విజేతలకు ఎమ్మెల్యే ఆనందరావు షీల్డులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో యు.మణిప్రసాద్, గెల్లా కృపావరం, చిట్టి మోషేను, శాంతిప్రకాష్, ఎ.ప్రసన్న, గోపీరాజు పాల్గొన్నారు. అలాగే ముఖ్య అతిథులను దుశ్శాలువాలతో సత్కరించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ అన్‌లోడు చేస్తుండగా మంటలు

అదుపు చేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని భారత పెట్రోల్ బంక్‌లో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం పెట్రోల్ బంక్‌లోకి వెళ్లిన ఆయిల్‌ట్యాంకర్ నుంచి అండర్‌గ్రౌండ్‌లో ఉన్న ట్యాంకర్‌లోకి పెట్రోల్‌ను ఆన్‌లోడు చేస్తుండగా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మంటలు చెలరేగాయి. దీంతో అక్కడి సిబ్బందితో పాటు పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులు పరుగులు తీశారు. దీంతో భయానక వాతవరణం ఏర్పడింది. ఒకరిద్దరు సిబ్బందిని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. బంక్ నిర్వాహకుల సమాచారంతో ఆర్యాపురం అగ్నిమాపక శాఖ ఫైరింజన్ సకాలంలో బంక్ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏ మాత్రం ఆలస్యమైనా పెనుప్రమాదం జరిగి భూగర్భంలో ఉన్న ఆయిల్‌ట్యాంక్‌లు పేలి చుట్టుపక్కల ప్రాంతాలు, వ్యాపార సంస్థలు తునాతునకలై ప్రాణనష్టం జరిగిఉండేది. ప్రమాదం తప్పి పెద్దగా ఆస్తినష్టం జరగలేదు.


పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ వద్ద చెలరేగుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

రూ. 14 లక్షలకు పైగా ఆస్తినష్టం

అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి పరిధిలోని తిరుమనాథంవారిపాలెం శివారులో ఆదివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిల్లు దగ్ధం కాగా రూ.14 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించింది. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి. కె.పెదపూడి చెందిన ఈతకోట సుబ్బారావు, ఈతకోట శ్రీనివాసరావు, ఈతకోట ఈశ్వరరావు, ఈతకోట మంగాయమ్మకు చెందిన తాటాకిళ్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. తొలుత సుబ్బారావు, శ్రీనివాసరావు ఉంటున్న తాటాకింటికి నిప్పటుంకోగా పక్కనేఉన్న ఈశ్వరరావు ఇంటికి మంటలు ఒక్కసారిగా వ్యాపించి రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. స్థలం కొనుగోలు కోసం దాచుకున్న సుబ్బారావుకు చెందిన నగదు రూ.1.50లక్షలు, 12 గ్రాముల బంగారం, అతడి కుమారుడి సర్టిఫికెట్లు, శ్రీనివాసరావుకు చెందిన రూ.2.50లక్షల నగదు, 18 గ్రాముల బంగారం, సర్టిఫికెట్లు, మంగాయమ్మకు చెందిన రూ.1.50 లక్షలు, బంగారం, ఈశ్వరరావుకు చెందిన రూ.2.70లక్షల నగదు, బంగారం గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు.


అగ్నికి ఆహుతవుతున్న తాటాకిళ్లు

ఆ రోజులు మళ్లీరావు..

ఏడున్నర పదుల వయసులోనూ ఎంతో ఉత్సాహం

గొల్లప్రోలులో కలిసిన 1964-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడున్నర పదుల వయస్సులోనూ వారిలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆరు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న వీరంతా కార్తీకమాసంలో ఏటా కలుసుకుంటారు. చిన్ననాటి సంగతులు గుర్తుకు తెచ్చుకుంటూ కుటుంబాల విషయాలు చర్చించుకుంటూ నూతనోత్తేజం పొందుతారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1954-65 ఎస్‌ఎస్‌ఎల్‌సీ(టెన్త్) బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని డాక్టర్ మల్లిరెడ్డి వెంకట్రాజు మెమోరియల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేదికగా కలుసుకున్నారు. వారు గత 26 ఏళ్లుగా ఏటా కార్తీకమాసంలో కలుసుకుంటున్నారు. ఆదివారం కలుసుకున్న వీరంతా చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. పిల్లలు మాదిరిగా నాడు తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, చిలిపి పనులు, నాడు జరిగిన పోటీలు తదితర అంశాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కుటుంబసభ్యులు వివరాలును పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపిన వీరంతా భారమెక్కిన హృదయాలతో పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు. తొలుత 76మంది వరకూ ఉండగా ప్రస్తుతం 30 మంది కలుసుకున్నారు.


గొల్లప్రోలులో కలిసి అలనాటి సంగతులు పంచుకుంటున్న పూర్వ విద్యార్థులు



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన సుమారు 400 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. నిత్యాన్నదానానికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయ సిబ్బంది రమణ, క్రాంతివీర్ పాల్గొన్నారు.



కాకినాడ రూరల్ పెనుమర్తిలో జరిగిన వనసమారాధనకు హాజరైన మంత్రి సుభాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ



కాకినాడ మెక్లారిన్ గ్రౌండ్‌లో జరిగిన శెట్టిబలిజ సంఘీయుల వనసమారాధనలో మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం



పిఠాపురం పట్టణ శివారు మాధవపురం రోడ్డులో జరిగిన కాపు ఐక్య వేదిక సమారాధనలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

వనమంతా సందడి

కాకినాడ రూరల్, కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోటల్లో పలు కుల సంఘాల కార్తీక వనసమారాధనలు

సర్పవరం జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా కార్తీక మాసంలో ప్రజలంతా వనభోజనం చేసే తెలుగు సంప్రదాయాన్ని ఐదేళ్లుగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ ఆలోచన స్ఫూర్తిదాయకమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ రూరల్ మండలం పెనుమర్తిలో ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మామిడితోట ప్రాంగణంలో పార్వతీ, పరమేశ్వరుల విగ్రహం, శివలింగం ఏర్పాటుచేశారు. వచ్చిన వారు శివలింగానికి క్షీరాభిషేకంతో పాటు పూజలు చేశారు. మహిళలు, చిన్నారులకు క్విజ్, ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వాటిల్లో రాణించిన వారికి ఏసీలు, వాషింగ్ మెషీన్లు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను బహుమతులుగా అతిథులు అందజేశారు. 30 కౌంటర్ల ద్వారా సుమారు 30వేలకు పైగా ప్రజలకు భోజనాలతో పాటు ఫ్రూట్‌సలాడ్, జ్యూస్, ఐస్‌క్రీమ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ సిటీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు పిడుగు హరిప్రసాద్, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కార్పొరేషన్ల చైర్మన్లు కుడుపూడి సత్తిబాబు, సుదీర్, వేగుళ్ల లీలాకృష్ణ రెడ్డి అనంతకుమారి, టీడీపీ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), కార్పొరేషన్ల డైరెక్టర్లు శిరంగు శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకుడు రంబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మొంథా తుఫాన్‌లో విశేష సేవలందించిన మండల అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, శానిటేషన్ వర్కర్లు, సిబ్బందిని ఎమ్మెల్యే నానాజీ సత్కరించారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): జాతి ఐక్యత, సామాజిక, రాజకీయ ఎదుగుదలకు తన వంతు కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ మెక్లారిన్ గ్రౌండ్‌లో ఆదివారం శెట్టిబలిజ సంఘ జిల్లా అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ అధ్యక్షతన శెట్టిబలిజ కార్తీక వనసమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పేదరికం కారణంగా చదువుకోలేని పిల్లలను తాను చదివిస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 16న అమలాపురంలో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక వనసమారాధనకు తరలిరావాలని కోరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ సంఘీయుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ కార్పొరేషన్ పనిచేస్తుందన్నారు. తొలుత సంఘ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి సుభాష్‌ను శాలువాతో సత్కరించారు. గుండె వ్యాధితో బాధపడుతున్న కాకినాడ వెంకటేశ్వరనగర్‌కు చెందిన నార్గాన కృష్ణారావుకు వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.20వేలు చెక్కును మంత్రి అందజేశారు. నాయకులు పిల్లి సత్యనారాయణమూర్తి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరి, పెంకే శ్రీనివాసబాబా, మేడిశెట్టి శేషారావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీనివాస్, పాలిక శ్రీను, వాసంశెట్టి భీమరాజు, కుడుపూడి సారధి, రాయుడు దుర్గ, జుత్తుక సూర్యకుమారి, పలివెల గాయత్రి, పెంకే వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): స్థలం చూపిస్తే కల్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు కేటాయిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రకటించారు. పిఠాపురం పట్టణ శివారు మాధవపురం రోడ్డులో ఆదివారం కాపు ఐక్య వేదిక ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఐక్య వేదిక ప్రతినిధులు, కాపు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): చేనేతవర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ముప్పన వారి బంగ్లాలో 27వ కార్తీక వనసమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం సంఘీయులు విందు భోజనాలు చేశారు.



పెద్దాపురంలో చేనేతవర్గాల వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోట మండలం ఉండూరులో పేపకాయల వారి 9వ ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చిన ఆ ఇంటి పేరు గల కుటుంబాలవారు



కాకినాడ రూరల్ మండలం పెనుమర్తిలో వనసమారాధనలో పాల్గొన్న ఎల్‌ఐసీ కాకినాడ డివిజన్ ఉద్యోగులు, ఏజెంట్లు

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పేపకాయల ఇంటి పేరుతో ఉన్న కుటుంబాలు ఆదివారం మండలంలోని ఉండూరులో కార్తీక వనసమారాధన జరుపుకున్నాయి. పేపకాయల వారి 9వ ఆత్మీయ సమ్మేళనానికి గ్రామాలు, పట్టణాలతో పాటు విదేశాల నుంచి కూడా అనేకమంది హాజరయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడి సమాజానికి చేస్తున్న సేవలను రంగంపేట జడ్పీటీసీ పేపకాయల రాంబాబు సమగ్రంగా వివరించారు. పేపకాయల ట్రస్టు పేరిట మూలనిధి సమకూర్చి పేపకాయల కుటుంబాల్లో పేదలకు అత్యవసర వైద్యం నిమిత్తం ఇవ్వడం, చనిపోయిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం వంటివి నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వచ్చే ఏడాది ఆత్మీయ సమ్మేళనాన్ని పెదబ్రహ్మదేవంలో నిర్వహించేందుకు తీర్మానించారు. వారంతా ఆటపాటలతో సందడిగా గడిపారు.

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో కార్తీక వనసమారాధన పేరిట సామూహిక విందు స్వీకరించారు. సభ్యులతో పాటు బాస్కెట్‌బాల్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామికి వస్త్రాలంకారం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైయున్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి వస్త్రాలతో అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ప్రత్యేక అలంకారం చేశారు. ఆదివారం ఆరుద్ర నక్షత్రం, ప్రాంతీయ నాగులచవితి సందర్భంగా స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సప్త హారతులు ఇచ్చారు. సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.



అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదం

తాళ్లరేవు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భిక్ష పెట్టారు. గురుస్వామి దొమ్మేటి సత్యనారాయణ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 400 మంది స్వాములు ప్రసాదం స్వీకరించారు. మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్‌ఎస్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం యథావిధిగా జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు 'డయల్ యువర్ కమిషనరు' నిర్వహిస్తామన్నారు. నగర పరిధిలోని సమస్యలను ఫోనులో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్పొరేషన్ అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌కు రాలేని అర్జీదారులు సమీపంలోని సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని సుధాకర్ చెప్పారు.



'పోరాటాలతోనే సమస్యల పరిష్కారం'

పిఠాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులంతా ఐక్య పోరాటాలు సాగించడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి పేర్కొన్నారు. పట్టణంలోని సూర్యరాయ గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో ఆదివారం యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పప్పు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, సీతారామరాజు, నగేష్, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

15న అమరవీరుల సంస్మరణ సభ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం పోరాటం చేసి అశువులుబాసిన అమరవీరుల సంస్మరణ సభను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్టు అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు తెలిపారు. చేబ్రోలులో ఆదివారం ఆయన నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, గొర్ల శివ, వీరన్న, శ్రీధర్, గుడాల సత్తిబాబు, బోడపాటి నాగవిష్ణు, నాగసత్తులు, తుక్కియ్య తదితరులు పాల్గొన్నారు.

'రామకృష్ణ సేవా సమితి సేవలు అమూల్యం'



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న హరీష్

కాకినాడ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో ప్రతినెలా 50 మంది ప్రాణాంతక వ్యాధిగ్రస్థ చిన్నారులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న రామకృష్ణ సేవా సమితి సేవలు అమూల్యమైనవని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. నగరంలోని శాంతినగర్‌లో గల శ్రీరామకృష్ణ సేవా సమితి ఆడిటోరియంలో ఆదివారం దాత కప్పగంతుల మోహనరావు ఆర్థిక సహాయంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్థ చిన్నారులకు పౌష్టికాహార కిట్‌లను అధ్యక్షుడు వీఎల్ గాంధీ, హరీష్ పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యుడు రామశేషాద్రి, స్కూల్ హెచ్ఎం ఎం.ఉమామహేశ్వరరావు, నోబుల్ టీచర్ అవార్డు గ్రహీత సుబ్రహ్మణ్యేశ్వరరావు, సామాజికవేత్త గురి గణేష్, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు

కలెక్టర్ ఆదేశాలనూ బేఖాతరు చేస్తున్నారు

తిమ్మాపురం పంచాయతీ అధికారుల తీరుపై సర్పంచ్ సత్యనారాయణ వ్యాఖ్య



సర్పవరం జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం పంచాయతీ ఆదాయానికి అధికారులు గండి కొడుతున్నారని, కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఎంబీఏ కాలేజీ నాన్ లే-ఔట్ స్థలంలో ఎటువంటి అనుమతి లేకుండా జీ ప్లస్-5 భవన సముదాయం నిర్మించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బెటర్‌మెంట్, పన్నుల రూపేణా సుమారు రూ.50 లక్షల మేర పంచాయతీకి చెల్లించాల్సి ఉందన్నారు. క్రమబద్ధీకరణ చేసి, బెటర్‌మెంట్, పన్ను కట్టించుకోవాలని పాలకవర్గం తీర్మానం చేసి మూడు నెలలు దాటినా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు సార్లు ఫిర్యాదు చేయగా.... స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని డీపీవోను కలెక్టర్ ఆదేశించారని, అయినా చర్యలు శూన్యమన్నారు. రెసిడెన్షియల్ భవనానికి అనుమతి పొంది, కమర్షియల్‌గా అక్షయ ఫంక్షన్ హాలు నిర్మించారన్నారు. రాజీవ్ గాంధీ, కాలేజీ అక్షయ ఫంక్షన్ హాలు నిర్వాహకులపై రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులకు ఆగస్టులో ఫిర్యాదు చేయగా వాటిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని అక్టోబరులో డీపీవోను ఆదేశిస్తూ ఉత్తర్వులు పంపినా ఎటువంటి చర్యల్లేవన్నారు. పంచాయతీ అధికారుల తీరుపై, నిర్వాహకులపై కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు వారంలో చర్యలు గైకొనకపోతే గాంధీజీ విగ్రహం వద్ద పాలకవర్గ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తామని సత్యనారాయణ చెప్పారు.

'వెలమ యువత అభివృద్ధికి కృషి'



నాయుడిని సత్కరిస్తున్న వెలమ సంక్షేమ సంఘం నాయకులు

సామర్లకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలమ యువత అభివృద్ధికి వెలమ సంక్షేమ సంఘం కృషి చేస్తుందని వెలమవిజయం పత్రిక చైర్మన్ బీజీ నాయుడు పేర్కొన్నారు. సామర్లకోట పట్టణ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తాండ్ర పాపారాయుడు విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. తాండ్ర పాపారాయుడు ద్విదశాబ్ది వేడుకలను ఈ నెలాఖరున ఘనంగా నిర్వహిస్తామని పట్టణ వెలమ సంక్షేమ సంఘం నాయకుడు ఆదపురెడ్డి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతరం నాయుడుని సన్మానించారు. కార్యక్రమంలో యడ్ల సత్యనారాయణ, మిడతాని మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో న్యాయ సేవలు: జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ

పిఠాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేద, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయసేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం చేశారని పిఠాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకట అపర్ణ తెలిపారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో ఆదివారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు, న్యాయవాదులు కేఎస్ఆర్ భాస్కర్, వాణిశ్రీ, జీపీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ఎంపీ రూ.లక్ష సాయం



బీటెక్ విద్యార్థిని దేవికి రూ.20వేలు అందజేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువు నిమిత్తం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తన వంతు విరాళంగా శ్రీయువసేనకు ఇచ్చిన రూ.లక్షను ఆరుగురు విద్యార్థులకు ఆదివారం ఎంపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. కోరంగి పైడా కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రంపం దేవికి రూ.20వేలు, బి.ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థిని మహాలక్ష్మికి రూ.20వేలు, విజయవాడ విజయ ఫార్మసీ ఇన్‌స్టిట్యూట్‌లో బి.ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమీనాకు రూ.20వేలు, కాకినాడ దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న జొన్నలగడ్డ రామ్‌చరణ్‌కు రూ.15వేలు, 5వ తరగతి చదువుతున్న మేఘన శిరీషకు రూ.15వేలు, జగన్నాథపురం ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దుర్గాభవానీకి రూ.10వేలు చొప్పున ఎంపీ అందించారు. శ్రీయువసేన ద్వారా చదివిస్తున్న విద్యార్థుల సంఖ్య 100 దాటిన సందర్భంగా ఎంపీ కేక్ కట్ చేసి శ్రీయువసేన సేవా సంస్థ అధ్యక్షుడు బొల్లం సతీష్‌ను, సభ్యులను, దాతలను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నున్న దొరబాబు, రాజ్‌కుమార్, బాబు పెరల్స్ నిర్వాహకులు హరీష్, దీపిక, అంబికా అక్వేరియం రెస్టారెంట్ నిర్వాహకులు కోన సతీష్, ప్రశాంతి పాల్గొన్నారు.





పిఠాపురంలో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం, సాధించిన పతకాలతో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ఉత్కంఠభరితంగా జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

పిఠాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికల విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌గా పిఠాపురం మొదటి స్థానం సాధించగా రెండో స్థానంలో జి.భావరం, మూడో స్థానంలో కత్తిపూడి జట్లు నిలిచాయి. ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్ ప్రారంభించగా, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, ఇంటర్మీడియట్ బోర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్‌కుమార్, రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యు.లోవరాజు, జి.శివప్రసాద్, పి.అచ్చిరాజు, బి.సతీష్ వ్యవహరించారు.

సత్యనారాయణపురంలో మహాన్నదానం



విశేష అలంకరణలో సత్తెమ్మ అమ్మవారు

సామర్లకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణపురంలో సత్తెమ్మ అమ్మవారికి ఆలయ వ్యవస్థాపకురాలు రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా భక్త పారాయణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన మహాన్నదానంలో వెయ్యి మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కౌన్సిలర్ సేపేని సురేష్, సామర్లకోట పీఏసీఎస్ అధ్యక్షుడు పైండి శ్రీనివాసు, వేట్లపాలేనికి చెందిన ల్యాండ్‌లార్డ్ చలికి సత్తిరాజు దంపతులు, ప్రముఖ హోల్‌సేల్ పండ్ల వ్యాపారులు నాగం కృష్ణ, నాగం అశోక్, వైసీపీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కుసుమంచి శేషగిరిరావు, సీనెట్ ఇంటర్‌నెట్ డిస్ట్రిబ్యూటర్ కుసుమంచి శ్యామ్‌కుమార్, వైద్య-ఆరోగ్య శాఖ డీఈవో అడపా బాబీ, స్టాంప్ వెండర్ పేకేటి చిరంజీవి, రాక్ సిరామిక్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ రాకేష్‌పూనియా తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో కార్డన్ సెర్చ్

45 బైక్‌లు, ఒక వ్యాన్ సీజ్

పిఠాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్‌ఐలు, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు తెల్లవారుజామునే వచ్చి డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేపట్టారు. కాలనీలోని గృహాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 45 బైక్‌లు, ఒక వ్యాన్‌ను సీజ్ చేశారు. అనుమానితులపై ఆరా తీశారు. కాలనీలోకి ఎవరైనా కొత్తవారు వస్తే తక్షణం సమాచారం అందించాలని సీఐ కోరారు. తనిఖీల్లో ఎస్‌ఐలు మణికుమార్, జానీబాషా, ఎన్.రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు సాయం

తాళ్లరేవు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోరింగ గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధిత వృద్ధ దంపతులకు తాళ్లరేవు జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ ఆదివారం చేయూత ఇచ్చారు. రూ.3వేలు నగదు, రూ.7వేలు విలువ చేసే బియ్యం, చీరలు, దుప్పట్లు, వంట సామగ్రి అందజేశారు. ఎంపీటీసీ పోతుల రత్నకుమారి, నల్లి శ్రీను, దడాల పండు, చంద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామిని కలశాలతో ఊరేగింపు

కోటనందూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకరాపల్లి గ్రామంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవం గురుస్వామి అమలకంటి కొండలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత, పారిశ్రామికవేత్త డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వాములు కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణారావు ఆధ్వర్యంలో 1200మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు చోడిశెట్టి బాలాజీ, అంకంరెడ్డి రమణ, గొంప దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ఏటీఏ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘ ఉపాధ్యాయులు

'ఆదివాసీ ఉపాధ్యాయ హక్కుల సాధనకు నిరంతర పోరాటం'

చింతూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నిరంతర పోరాటం చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ పేర్కొన్నారు. ఏటీఏ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివాసీ ఉపాధ్యాయులు ఆదివారం చింతూరులో ఘనంగా జరుపుకున్నారు. సంఘ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం శేఖర్ మాట్లాడుతూ మన్యంలో ఉపాధ్యాయ, ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులను ఆదివాసీలకే కేటాయించాలని కోరారు. 2025 -డీఎస్సీలో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏటీఏ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్యామల సుబ్బయ్య, డివిజన్ కార్యదర్శి సోడె నారాయణ, మండల శాఖ అధ్యక్షుడు బాబూరావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు రామకృష్ణ, రవి, కన్నారావు, వెంకన్నబాబు, శేఖర్, చంద్రయ్య, కన్నమ్మ, మీనా, సీత, ప్రియాంక, జోగారావు, అశోక్, శివాజీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి'

వీఆర్‌పురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ. అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కుంజవారి గూడెంలో ఆదివాసీ గిరిజన సంఘం 8వ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కల్పిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, రంపచోడవరం కేంద్రంగా గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. సంఘ పతాకాన్ని సీనియర్ నాయకులు జల్లి తమ్మయ్య, రవ్వ బుచ్చిరాజు ఎగురవేశారు. ఎంపీపీ కారం లక్ష్మి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, నాయకులు సవలం మారయ్య, తుర్రం బాబూరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



స్టాల్‌లో పదార్థాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

'పౌష్టికాహార పదార్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలి'

రంపచోడవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ద్వారా తయారుచేసిన 35 రకాల పౌష్టికాహార పదార్థాలపై గిరిజన ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో బి.స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక మసీదు సమీపంలో శిశు సంక్షేమ శాఖ, వందన్ వికాస కేంద్రాలు, గిరిజన సహకార సంస్థల ద్వారా ఏర్పాటుచేసిన వివిధ పదార్థాలు, ఉత్పత్తులు, జీడిపప్పు స్టాల్స్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులు మానవ జీవనానికి తోడ్పాటునిస్తాయన్నారు. జీసీసీ డీఎం జయశ్రీ, ఏపీడీ దేగలయ్య, తహసీల్దారు పి.బాలాజీ, ఎంపీడీవో వై.రాజు, సీడీపీవోలు కె.ఉమ, క్రాంతికుమారి, సుచరిత, ఝాన్సీ సుజాత, రవళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, వందన్ వికాస కేంద్రాల సభ్యులు, జీసీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



మోతుగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ప్రధాన రహదారిలో పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద స్థానిక ఎస్‌ఐ ఎస్‌కే సాధిక్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లో రవాణా చేస్తున్న సామగ్రిని పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, మురళి, పురుషోత్తం, సన్ని, సుబ్బారావు, సీఆర్పీఎఫ్ ఏ/42 పోలీసులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడాలి'

చింతూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ కోరారు. ఆదివారం చింతూరులో జరిగిన సీఐటీయూ తొమ్మిదవ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16, 17 తేదీల్లో రంపచోడవరంలో జరిగే జిల్లా మహాసభలను, డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తొలుత సంఘ పతాకాన్ని సీనియర్ నాయకుడు చింతా రాంబాబు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, లక్ష్మయ్య, వివిధ రంగాలకు చెందిన కార్మిక నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక



చింతూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ చింతూరు మండల కమిటీ ఎన్నిక ఆదివారం ఎర్రంపేటలో జరిగింది. కన్వీనర్‌గా పొడియం లక్ష్మణ్, సహ కన్వీనర్‌గా కారం సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఎన్నికైన 29 మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కాపు సామాజిక భవనాన్ని నిర్మిస్తాం

• హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

జగ్గంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మీసాల చిన్నబాబు ఆధ్వర్యంలో కాపు వన సమారాధన వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి జగ్గంపేట పరిసర ప్రాంతాల నుంచి 5వేల మంది కాపు కుటుంబాలవారు హాజరై ఆటపాటలతో గడిపారు. అనంతరం వనభోజనాలు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, తోట త్రిమూర్తులు, వరుపుల సుబ్బారావు, వంగా గీత, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, కాకినాడ మాజీ మేయర్ నాగిరెడ్డి చంద్రకళ దీప్తి, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, అరుణాచల మాధవి, కాపు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల కాపు నాయకులు హాజరై ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం చిన్నారుల కూచిపూడి నాట్యాలతో ఆహుతులను అలరించారు. అనంతరం అరుణాచల మాధవి ప్రవచనాలతో పరవశింపజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ క్విజ్ పోటీల ద్వారా సేకరించిన రూ.1.14లక్షలు కాపు సంక్షేమానికి ఉపయోగించాలని సంఘఅధ్యక్షుడు మీసాల చిన్నబాబుకు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాపు సామాజిక భవనానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.10లక్షలు గ్రాంటు అందిస్తానని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించిన జగ్గంపేట కాపు సంక్షేమ సంఘాన్ని అభినందించారు. కాపు సామాజిక భవనంలో అన్నిరకాల ఫంక్షన్లు నిర్వహించాలంటే భోజనశాల, వంటగది, వాచ్‌మ్యాన్ రూమ్ అవసరమని, వీటిని తన సొంత నిధులతో తన తండ్రి జ్యోతుల నాగేశ్వరరావు పేరున త్వరలో నిర్మాణం చేపడతానన్నారు. అదేవిధంగా 10అతిథి గదులు నిర్మించేందుకు దాతలు ముందుకు వస్తే వారి పేరిట మీద నిర్మించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతుల మణి, తోట సునీత, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, జీను పెద్ద రాంబాబు, బండారు రాజా, మారిశెట్టి భద్రం, దవులూరి ఈశ్వరరావు, మారిశెట్టి రాధా, తోలేటి సూర్యనారాయణ, తులా నరసింహారావు, కురుమళ్ళ నాగేశ్వరరావు, రాయిసాయి, అంగజాల బ్రహ్మాజీరావు, మసకపల్లి భైరవస్వామి పుర్రె సూరన్న, తోట బుచ్చిరాజు,అడపా తాతాజీ, చల్ల రామ్మూర్తి, సూ రపరెడ్డి నరేష్, గేడ్డమూరి బాబ్జి, మారిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు. జగ్గంపేట టౌన్‌గుర్రపా లెం రోడ్డులో తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో తూర్పుకాపు కార్తీక వన సమారాధన జరిగింది. దీనికి జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. తూర్పు కాపు సంఘంతుమ్మలపల్లి రమేష్‌ను సత్కరించారు. జనసైనికులు, నాయకులు, తూర్పు కాపు ప్రముఖులు, తూర్పుకాపు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఎంపీతో నెహ్రూ, జ్యోతుల నవీన్ కాపు సంఘ నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్

జగ్గంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన 14కుటుంబాలకు రూ.7.11లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆదివారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యం సహాయం విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, బాదంపూడి ప్రకాష్, గల్లా శ్రీను, మునిరెడ్డి శ్రీనివాస్, చింతల రామకృష్ణ, కందుల జమీలు, చిట్యాల బాబ్జి, చిట్యాల అప్పారావు, రాజారావు పాల్గొన్నారు.

కూటమి ఐక్యతను దెబ్బతీసే కుట్రను తిప్పికొడతాం

• మీడియా సమావేశంలో తుని జనసేన నాయకులు



తునిలో మీడియా మాట్లాడుతున్న జనసేన నాయకులు

తుని రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్రయోజనాల కోసం కూటమి ఐక్యతను దెబ్బతీసేందుకు తునిలో కొందరు జనసేన నాయకులు చేస్తున్న కుట్రను తిప్పి కొడతామని జనసేన కార్యకర్తలు తునిలో ఆదివారం పేర్కొన్నారు. జనసేన తుని నియోజకవర్గ కోఆర్డినేటర్ చోడిశెట్టి గణేష్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఆదివారం జిల్లా జనసేన మాజీ కార్యదర్శి బోనం చినబాబు, జిల్లా కార్యదర్శి పలివెల లోవరాజు, దండెం రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అద్దేపల్లి జానకి బాలాజీ, మండల ప్రధాన కార్యదర్శి లట్టాల నాగేశ్వరరావు, బొప్పాన రాంబాబు, షేక్ రబ్బాని విలేకరులతో మాట్లాడారు. తుని కూటమి పార్టీల్లో వ్యక్తిగత అభిప్రాయాలు, స్వార్థాలకు తావు లేదని, ప్రజా అవసరాలే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. ప్రజా అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే యనమల దివ్య పనిచేస్తున్నారన్నారు. జనసైనికులు ప్రస్తావించిన ప్రతీ సమస్యను యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్య పరిష్కరిస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవుల్లోను సముచిత స్థానం కల్పించారని, జనసైనికుల రాజకీయ ఎదుగులకు అన్ని విధాలా ఎమ్మెల్యే దివ్య సహకరిస్తున్నారన్నారు. ఈసమావేశంలో జనసేన తొండంగి మండల ప్రధాన కార్యదర్శి గట్టెం నాగబాబు, తుని మండల అధ్యక్షుడు ధారకొండ వెంకటరమణ, బాలికల కళాశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మొగశాల శ్రీనివాస్, గోసల జగన్నాధం, దూనే కోటేశ్వరరావు, సలాది ఉదయభాస్కర్, వెంకటరమణ పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

తొండంగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని ఎస్‌ఐ జగన్మోహన్ సూచించారు. ఒంటిమామిడిలో ఆదివారం సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లను, లింక్‌లు ఓపెన్ చేయవద్దన్నారు.

జగ్గంపేట బాయ్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో సందర్శించిన సీఐ

జగ్గంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట బాయ్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఆదివారం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడకూడదని, మత్తు పదార్థాలు, పానియాల జోలికి పోరాదన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఏదైనా సమస్యలుంటే 100 లేదా 94407 96529 ఫోన్‌చేసి పోలీస్ దృష్టికి తేవాలన్నారు.

లింగంపర్తిలో దీపోత్సవం



ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దీపోత్సవం

ఏలేశ్వరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తిలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఆలమూరి సుబ్బారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని 108 ప్రమిదలతో దీపోత్సవం జరిపారు. వరుపుల వెంకటలక్ష్మీ, మాటూరి రత్నమాల, వరుపుల కృష్ణవేణి, కప్పల కృష్ణ, చినబాబు, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు



భక్తులకు దర్శనమిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మురారి గ్రామ శివారులో మామిడి తోటలో కనకదుర్గమ్మను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా అయ్యప్ప స్వామి, శివ, సత్యనారాయణమూర్తి మాలాధారులు ఆలయానికి చేరుకుని పూజలే చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

అఖండ సాయి నామ సంకీర్తన

కిర్లంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా 24 గంటల పాటు అఖండ సాయి నామ సంకీర్తన జరిగింది. కిర్లంపూడిలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాచపల్లిలో ఆదిత్య హోమం

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అరుణాచల క్షేత్రంలో ఆదివారం ద్వాదశ ఆదిత్యహోమం నిర్వహించారు. సూర్యనారాయణమూర్తికి పంచామృత అభిషేకాలు, పంచహారతులు ఇచ్చారు. అలాగే ఆలయంలో అరుణాచలేశ్వర స్వామికి అపీత కుచాంబ అమ్మవార్లకు సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రమా నంద ఆధ్వర్యంలో వేదపండితులు పుష్కరిణి వద్ద గంగామాతకు హారతి చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవులకు అన్నదానం

• ప్రత్తిపాడులో గురుస్వామి పంచదార్ల సేవ

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో పంచదార్ల నాగేశ్వరరావు అనే అయ్యప్ప భక్తుడు 43 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ చేసి గ్రామంలోని కాలభైరవుల (వీధికుక్కలకు)కు కార్తీకమాసంలో అన్నదానం చేస్తున్నాడు. వీధికుక్కలకు అన్నదానం చేయడం వల్ల శివానుగ్రహం పొందవచ్చనే సంకల్పంతో గురుస్వామి ఏటా గ్రామంలోని వీధి కుక్కలకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆదివారం పరమాన్నం, అన్నం, కూరలను కావిడిలో మోస్తూ వీధివీధి తిరుగుతూ వీధికుక్కలకు పెట్టారు.

కోలుకుంటున్న క్షతగాత్రులు

కిర్లంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ముగ్గురు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురు కోలుకుంటున్నట్టు ఆదివారం కిర్లంపూడి పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనపై ఇన్‌చార్జి ఎస్‌ఐ రఘునాథరావు కేసు నమోదు చేశారు.

ఐక్యతకు వన సమారాధనలు దోహదం

• ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడులో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, ఆధ్యాత్మికతలకు కార్తీక వన సమారాధనలు దోహదపడతాయని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రెడ్డి గారి పామాయిల్ తోటలో ఆదివారం నిర్వహించిన వన సమారాధనకు ఆమె విచ్చేసి ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీకమాసం హిందువులకు అత్యంత ప్రధానమైనదని, ఈ మాసంలో భక్తులు ఉపవాస దీక్షలు, దీపారాధనలు, శివార్చనలు, అన్నప్రసాద వితరణ వంటి పుణ్యకార్యాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాల వల్ల ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. ఏపీ ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, సత్తి రామలింగేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి, యాళ్ల జగదీష్, యాళ్ల విశ్వేశ్వరరావు, మదినే దొరబాబు, వెలుగుల నాని పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లిలో వెలమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు జరిగాయి. జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ విచ్చేయగా వెలమ సంఘీయులు శాలువా కప్పి సత్కరించారు. జనసేన నేతలు, వెలమ ప్రముఖులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక దొర గారి కోటలో కార్తీకమాస వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ దర్పణ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన, కొత్తపేట వారి కోలాట ప్రదర్శన జరిగింది. నాట్యం ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ మండల ప్రెసిడెంట్ గానుగుల శ్రీనివాసరావు, కామాక్షి జ్యువెలరీస్ కొత్తల బ్రదర్స్, కొత్తల వీరప్రసాద్, లక్కోజు శివరామకృష్ణ, కొత్తల శ్రీను, చలపాక శివప్రసాద్, అత్తిలి వీరబ్రహ్మం, కొమ్మోజు సత్యనారాయణ పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలో వనభోజనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రౌతులపూడిలో శ్రీభవానీ వర్తక సంఘం, బంగారయ్యపేటలో శ్రీగంగాలమ్మ ఆలయం, బలరామపురంలో దుర్గాదేవి ఆలయం వద్ద జరిగాయి. అధికసంఖ్యలో అయ్యప్ప స్వాములు, గ్రామస్థులు హాజరై వనభోజనాలు స్వీకరించారు.

రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఈశ్వరుడు



డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న వెన్నా ఈశ్వరుడు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కత్తిపూడికి చెందిన వెన్నా ఈశ్వరుడు బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఆదివారం ఆ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి సమక్షంలో చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, డీఎం శ్రీనివాసరావు ఆయనతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు. ఈసందర్భంగా ఈశ్వరుడు మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి తనవంతు సహకారం చేస్తానన్నారు. అనంతరం ఆయనను జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి), టీడీపీ నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, కీర్తి సుభాష్, కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, రాజాల చిట్టిబాబు, పొలం చిన్న, సాధనాల లక్ష్మీబాబు సన్మానించి అభినందించారు.

ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు

ప్రత్తిపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఆర్థిక తోడ్పాటును అందించనున్నట్లు ఎన్నారై చెక్కపల్లి రమేష్ ట్రస్ట్ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 2025-26 విద్యాసంవత్సరంలో ఐఐటీ, నీట్, జేఈఈ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఎంసెట్‌లో 10వేల లోపు ర్యాంక్ సాధించి, ఆర్థికంగా బాగా వెనుకబడిన విద్యార్థుల్లో ఒక్కొక్కరిని ఎంపిక చేసి ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. అమెరికాలో స్థిరపడిన ఎన్నారై చెక్కపల్లి రమేష్ ట్రష్టిగా 2012-13 సంవత్సరం నుంచి ఏటా అర్హులైన విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లు అందజేస్తు న్నారు. అర్హులైన విద్యార్థులు 9949422468, 8555870079 నెంబర్లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులను http://acrobat. adobe. com/id/urn:aaid: sc:AP:508599d8&1947&4eaa&9f64& 159656557786 లింకు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ముమ్మరంగా మాసూళ్లు

• వరి పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు



మిషన్ ద్వారా వరి కోతకోస్తున్న దృశ్యం

జగ్గంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వరి పంట కోత వచ్చింది. మిషన్ ద్వారా వరి పంటను కోసే పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. వారం రోజుల నుంచి జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో మిషన్ల ద్వారా వరి పంట కోతలు చేపడుతున్నారు. వెంటనే ధాన్యాన్ని తూకం వేసి గోనె సంచుల్లో నింపి ప్రభుత్వం కేటాయించిన మిల్లర్లకు తరలిస్తున్నారు. రెండు తుఫాన్లు ఎదుర్కొని రైతు మొదటి పంటను ఒబ్బిడి చేసుకోవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 75కిలోల స్వర్ణ ధాన్యం రూ.1500 ధర ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

పబ్లిక్ ప్లేసులో మద్యం సేవిస్తున్న పలువురిపై కేసులు నమోదు



మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకితీసుకున్న పోలీసులు

జగ్గంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో శనివారం రాత్రి పబ్లిక్ స్థలాల్లో మద్యం సేవిస్తున్న పలువుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జగ్గంపేట ఎస్‌ఐ టి.రఘునాథరావు సిబ్బందితో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. జగ్గంపేట శివారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువుర్ని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరిని సోమవారం ఉదయం కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

జాగా కనబడితే చాలు పాగా



కోళ్ళఫారం సెంటర్ వద్ద ఆక్రమణకు గురైన స్థలంలో నిర్మాణంలో చేపడుతున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా జాగా కనబడితే కొందరు అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. అధికారుల ఉదాసీనత కారణంలో మండలంలోని పలుచోట్ల విలువైన పంచాయతీ, ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణ లకు గురవుతున్నాయి. తాజాగా వి.కొత్తూరు పంచాయతీ పరిధిలో కోళ్ళ ఫారం సెంటర్ లోపల అంగన్‌వాడీ సెంటర్‌కు చెందిన స్థలాన్ని ఆక్రమించి, అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతుండటంపై విమర్శలు వచ్చాయి. ప్రజా ప్రయోజనార్థం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టడంపై అధికారుల తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పున్నమి చవితి



ఏలేశ్వరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం / గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పున్నమి చవితి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం పొలాల్లో ఉన్న పుట్టల్లో భక్తులు పాలు, చలివిడి, సిమ్మిడి వేసి నాగదేవతకు పూజలు చేశారు. బాణసంచా కాల్చారు. అక్కడే భోజనాలు చేసి కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాల్లో వేకుజామునే పురోహితులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామ శివారు పామాయిల్ తోటలో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం ఎస్‌ఐ యూవీ శివ నాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.5,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.